క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై టోల్‌ఫ్రీ నంబర్

కాకినాడ: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సూచించారు. అవసరమైతే ప్రజలకు తగిన వైద్య సేవలు అందించేందుకు నగరపాలక సంస్థ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే నగరపాలక సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 18004255990కు కాల్ చేయాలని కమిషనర్ సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రజలు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలని కమిషనర్ సూచించారు.

నేడు నేమాం నుంచి పింఛన్ల పంపిణీ

కాకినాడ రూరల్: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని సోమవారం మండలంలోని నేమాం గ్రామం నుంచి ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రారంభించనున్నారు. ఉదయం 8 గంటలకు నేమాం, 9 గంటలకు పండూరు, 10 గంటలకు కాకినాడ అర్బన్ రమణయ్యపేట 1వ డివిజన్‌లో జరిగే పింఛన్ల పంపిణీలో నానాజీ పాల్గొంటారు. అనంతరం కరప మండలం గురజానపల్లి గ్రామంలో పాల్గొంటారు. మండలంలో మొత్తం 18,337 మంది లబ్ధిదారులకు రూ.12,42,02,000 సొమ్ములను పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ రమేష్‌నాయుడు తెలిపారు.

విరీషకు ఎంపీపీ బాధ్యతలు


బందిలి విరీష

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ మండల ఎంపీపీ పదవికి గోపిశెట్టి పద్మజ రాజీనామాను జెడ్పీ సీఈఓ శ్రీరామచంద్రమూర్తి ఆమోదించారు. నూతన అధ్యక్షురాలి ఎన్నిక జరిగే వరకు, వైస్ ఎంపీపీ బందిలి విరీష ఎంపీపీ బాధ్యతలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొంటూ, ఆమెకు సహకరించాలని ఎంపీడీఓను ఆదేశించారు.

బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తా

కాకినాడ రూరల్ ఎంపీపీగా బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని తిమ్మాపురం-1 ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ బందిలి విరీష పేర్కొన్నారు. ఎంపీపీ పద్మజను ఆదర్శంగా తీసుకుని తన బాధ్యతలు చేపడతానన్నారు. కొత్త ఎంపీపీని తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, గ్రామస్తులు అభినందించారు.

ఇంటి పన్నుల చెల్లింపు గడువు పొడిగించాలి

బోట్‌క్లబ్: మున్సిపల్ ఆస్తి పన్నుల చెల్లింపు గడువు జూన్ నెలాఖరుతో ముగుస్తున్నందున 10 శాతం రాయితీతో పన్నులు చెల్లించే వెసులుబాటును ప్రభుత్వం కల్పించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం మున్సిపల్ అధికారులను కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఆస్తిపన్ను డిమాండ్ నోటీసులను బట్వాడా చేయకపోగా, తక్షణం చెల్లించాలనడం సరికాదన్నారు. జూలై నెలాఖరు వరకు గడువు పొడిగించాలని డిమాండ్ చేశారు. ఆస్తి విలువపై ఇంటి పన్ను విధానాన్ని వ్యతిరేకించిన ఎన్‌డీఏ ప్రభుత్వం తక్షణమే ఆదాయ ప్రాతిపదిక ఇంటిపన్ను విధించే మార్పులు తీసుకురావాలని కోరారు. ఈ మేరకు సీఎం, మున్సిపల్ మంత్రులకు వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు.

హిందువుల ఐక్యత చాటడానికే శోభాయాత్ర

- ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి ఓలేటి
- భక్తిశ్రద్ధలతో హనుమాన్ శోభాయాత్ర


సామర్లకోట ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రారంభమైన శోభాయాత్ర

సామర్లకోట: హిందువుల ఐక్యతను చాటి చెప్పేందుకే మూడేళ్లుగా నియోజకవర్గ పరిధిలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యకారిణి సభ్యుడు (రాజమహేంద్రవరం) ఓలేటి సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన హనుమాన్ శోభాయాత్రలో ఆయన పాల్గొన్నారు. వందలాది మంది జై హనుమాన్ అనే నినాదాల మధ్య తుమ్మల రామస్వామి ఈ శోభాయాత్రను ప్రారంభించారు. ప్రసన్నాంజనేయుని ఆలయం, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ప్రత్తిపాడు జంక్షన్, బ్రౌన్‌పేట జంక్షన్, పాత తహసీల్దార్ కార్యాలయం, గాంధీచౌక్, స్టేషన్ సెంటర్, మఠంసెంటర్, మెహర్ కాంప్లెక్స్ మీదుగా తిరిగి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం సెంటర్‌కు రామనామ జపంతో భక్తుల శోభాయాత్ర చేరి అక్కడి నుంచి పెద్దాపురానికి శోభయాత్ర చేరింది. శోభాయాత్ర నిర్వాహకులు కర్రి అప్పలరాజు, పోతుల ప్రభాకర్, ఏడు కొండలు, విజ్జు, గణేష్ తదితరులు భక్తులకు సేవలు అందించారు. సీఐ అంకబాబు ఆధ్వర్యంలో ఎస్సై మూర్తి, ఏఎస్సై రత్నం ఇతర సిబ్బంది బందో బస్తు ఏర్పాట్లు చేశారు.


ఓపీ కౌంటర్ల సమీపంలో ఏర్పాటవుతున్న ఆర్ఓ ప్లాంటు


గైనిక్ ఎల్ఆర్ వెనుక..


ఓపీ సేవల భవంతిలో..

జీజీహెచ్‌లో సుజల ధారలు

- సిద్ధమవుతున్న నాలుగు ఆర్ఓ ప్లాంట్లు
- రూ.30 లక్షలు వెచ్చించిన 'కోస్టల్ ఆక్వా'
- నెల రోజుల్లో అందుబాటులోకి తాగునీరు
- హర్షం వ్యక్తం చేస్తున్న రోగులు, బంధువులు


జీజీహెచ్‌లో ఓపీ వద్ద రోగులు, సహాయకుల రద్దీ

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌కు వచ్చే రోగులు, వారి బంధువుల దాహార్తి తీరనుంది. ఇప్పటికే ఉన్న ఆర్ఓ ప్లాంట్లకు అదనంగా మరో నాలుగు సమకూరనున్నాయి. మరో నెల రోజుల వ్యవధిలో ఈ ప్లాంట్లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నాయి.

అందరికీ అందుబాటులో...

జీజీహెచ్‌లో ఏర్పాటు కానున్న నాలుగు ఆర్ఓ ప్లాంట్లను ఆసుపత్రిలోని ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. రోగుల రద్దీ, వార్డులకు సమీపం, నీటి వనరులు ఏవీ అందుబాటులోలేని చోట్ల వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఓపీ కౌంటర్ల సమీపాన ఓ ప్లాంటు, సర్జికల్, ఆర్థో, సైకియాట్రీ ఓపీలు కొనసాగుతున్న ప్రాంగణంలోని సరిగ్గా మధ్యలో రెండో ప్లాంటు, గైనిక్ ఎల్ఆర్ వద్ద మూడో ప్లాంటు, నూతనంగా నిర్మితమవుతున్న ఎంసీహెచ్ బ్లాక్ వద్ద నాలుగో ప్లాంటు సిద్ధమవుతున్నాయి.

కోస్టల్ ఆక్వా సంస్థ సహకారంతో...

కోస్టల్ ఆక్వా సంస్థ ఆర్థిక సహకారంతో ఈ ప్లాంట్ల నిర్మాణం చేపట్టినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. సంస్థ ఎండీ దిలీప్ ఇందుకు రూ.30 లక్షల భారీ మొత్తాన్ని వెచ్చించారని ఆమె పేర్కొన్నారు. భారీ శుద్ధి జల సామర్థ్యంతో ఈ ప్లాంట్ల నిర్మాణం జరుగుతుందన్నారు.

స్థల కేటాయింపులో ప్రత్యేక శ్రద్ధ

దాతలు అందిస్తున్న ప్రయోజనాలను పూర్తి స్థాయిలో రోగులకు అందించే లక్ష్యంతో సూపరింటెండెంట్ తగిన కసరత్తు చేశారు. దాన ప్రయోజనాన్ని పూర్తి స్థాయిలో రోగులకు అందించే లక్ష్యంతో ప్లాంట్ల ఏర్పాటుకు ఓ బృందాన్ని ఏర్పాటుచేసి బహుళ ప్రయోజనాలు చేకూర్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

10 వేలు.. 5 వేల లీటర్లు

జీజీహెచ్‌లో ఇప్పటికే అందుబాటులో ఉన్న మూడు ఆర్ఓ ప్లాంట్ల సామర్థ్యం రెండు వేల లీటర్ల చొప్పునే. అయితే కొత్తగా ఏర్పాటు చేయనున్న ప్లాంట్ల సామర్థ్యం 10 వేల లీటర్ల చొప్పున కాగా మరో రెండు ప్లాంట్లు 5 వేల లీటర్లు కలిగినవి. వీటి ఏర్పాటుతో జీజీహెచ్‌లో ఇక తాగునీటి సమస్య ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇకపై మినరల్ వాటర్ ఫ్రీ

జీజీహెచ్‌లో ప్రస్తుతం ఉన్న ఆర్‌వో ప్లాంట్ల ద్వారా నీటిని లీటరుకు రూ.1 నామ మాత్రపు రుసుముతో విక్రయిస్తున్నారు. అయితే తాజా ప్లాంట్ల ఏర్పాటుతో స్వచ్ఛమైన తాగునీరు పూర్తిగా ఉచితంగా అందనుంది. ఎటువంటి రుసుము చెల్లించకుండానే మినరల్ వాటర్ పొందే సౌలభ్యం అందుబాటులోకి రానుంది.

మా కృషి ఫలించింది



రోగుల దాహార్తిని తీర్చేందుకు దాతల్ని సంప్రదించాం. సహృదయంతో స్పందించిన కోస్టల్ ఆక్వా సంస్థ ఎండీ దిలీప్ రూ.30 లక్షలు వెచ్చించారు. మా కృషి ఫలించింది. రోగులకు సాంత్వన చేకూరింది. స్థల కేటాయింపులో అనుసరించిన విధానం రోగులకు అందుతున్న ప్రయోజనాన్ని రెట్టింపు చేసింది. రోగుల ప్రయోజనం కోసం దాతలు ముందుకు రావాలి. ఉభయగోదావరి జిల్లాలకే తలమానికంగా ఉన్న ఈ ఆస్పత్రిని ఉన్నత సేవల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మరిన్ని ఏర్పాట్లు చేయాల్సి ఉంది.

– డాక్టర్ లావణ్యకుమారి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ

స్థూలకాయంతో కీళ్ల అరుగుదల


వైద్య శిబిరంలో ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కాకినాడ రూరల్: స్థూల కాయంతో కీళ్లు అరిగిపోయే ప్రమాదం ఉందని డాక్టర్ చల్లా భావతేజ పేర్కొన్నారు. మండలంలోని సర్పవరం గ్రామంలో భావనారాయణ స్వామి ఆలయం ఎదురుగా కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం గ్రామ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యులు భావతేజ, ఆకుల స్వాతి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యుడు భావతేజ మాట్లాడుతూ శరీరంలో కొవ్వు అధికంగా పేరుకుపోవడంతో బరువు పెరుగుతుందన్నారు. శరీరానికి తగినంత వ్యాయామం, జంక్ ఫుడ్ మానుకోవడం ద్వారా బరువు తగ్గవచ్చన్నారు. బరువు వల్ల కీళ్ల నొప్పులతో పాటు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యుడు సత్తిబాబు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పంపన వెంకట్రావు, రామచంద్రరావు, భాస్కరరావు, బండి శ్రీనివాస్, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

సమాజ అవసరాల మేరకు శాశ్వత ప్రాజెక్టులు


నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన డాక్టర్ బాలకృష్ణ

- లయన్స్ క్లబ్ జిల్లా పూర్వపు గవర్నర్ బాలకృష్ణ

బాలాజీచెరువు: లయన్స్‌క్లబ్ ద్వారా శాశ్వత ప్రాజెక్టులు స్థాపించి సేవలకు సార్థకత చేకూర్చుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా పూర్వపు గవర్నర్, అంబాసిడర్ ఆఫ్ గుడ్‌విల్ అవార్డు గ్రహీత డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక లయన్స్ హాల్లో ఆదివారం ఆరు లయన్స్ క్లబ్‌లకు నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు క్లబ్ ఆశయాలు వివరించామని, లయన్స్ క్లబ్ శాశ్వత ప్రాజెక్టులైన ఐగ్లాస్ ప్రాజెక్టు, ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం, లయన్స్ ఆక్సిజన్ బ్యాంక్, లయన్స్ హాల్ ఆఫ్ సర్వీస్, లయన్స్ ఏకో ఫ్రెండ్లీ సర్వీస్ వంటి వాటి ద్వారా సేవ చేస్తున్నామని, క్లబ్‌లకు అధ్యక్షులుగా ఉన్న వారు వారి కాలంలో వాటి అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. లయన్స్‌క్లబ్ కాకినాడ అధ్యక్షుడిగా ఎంవీఆర్ మోహన్‌కుమార్, సఖి క్లబ్ అధ్యక్షులుగా కే.ఉమాదేవి, స్టార్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎండీ షర్మిల, మనం క్లబ్ అధ్యక్షులు జే.మధురవాణి, గోల్డ్ క్లబ్‌కు జక్కా రవికుమార్, లయనీస్ క్లబ్‌కు ఎం.అన్నపూర్ణలతో జిల్లా పూర్వపు గవర్నర్ మంజులూరి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ గోలి శ్రీరాములు, వైస్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తీర ప్రాంతంలో కలెక్టర్ పర్యటన

కొత్తపల్లి: ఉప్పాడ తీర ప్రాంతంలో కలెక్టర్ షాన్ మోహన్ సగిలి ఆదివారం పర్యటించారు. 3న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ ఉప్పాడ తీర ప్రాంతంలో కోతకు గురవుతున్న మత్స్యకార గృహాలు, నిర్మాణంలో ఉన్న మేజర్ హార్బర్ నిర్మాణ పనులను పరిశీలించి మత్స్యకారుల సమస్యలు తెలుసుకోనున్నారు. ఈ పర్యటనకు సంబంధించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎన్నికల అనంతరం తొలిసారిగా పవన్ నిర్వహించే ఈ పర్యటనకు సంబంధించి బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కాకినాడ, పెద్దాపురం ఆర్డీఓలు కిశోర్, సీతారామారావు, తహసీల్దార్ సుందర్‌రాజు, ఎంపీడీఓ వెంకటనారాయణ, పిఠాపురం సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రాయ్‌ను వైద్యులు ఆదర్శంగా తీసుకోవాలి


ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ విశ్రాంత వీసీ డాక్టర్ ఐవీ రావును సత్కరిస్తున్న లయన్స్ ఎలైట్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: వైద్యులు డాక్టర్ రాయ్‌ని ఆదర్శంగా తీసుకోవాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత వీసీ డాక్టర్ ఐవీ రావు అన్నారు. లయన్స్ క్లబ్ ఎలైట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కాస్మాపాలిటిన్ క్లబ్‌లో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. సమావేశానికి క్లబ్ అధ్యక్షుడు మైలవరపు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. అవయవ దానం లయన్స్ క్లబ్‌లు నిర్వహిస్తున్న ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చాలా మందికి కొత్త జీవితాన్నిస్తాయన్నారు. ఈ అంశంపై గతంలో డాక్టర్ బాదం బాలకృష్ణకు చేసిన సూచనకు స్పందించి ఆర్గాన్ డొనేషన్ విభాగాన్ని నగరంలో ఏర్పాటు చేయడం ద్వారా ఎంతో మందికి ప్రాణదానం చేశారన్నారు. ఎలైట్ క్లబ్ ఈ విషయంపై ప్రత్యేక దృష్టిని సారించాల్సిందిగా కోరారు. క్లబ్ కార్యదర్శి కేంద్ర ప్రభుత్వ జాతీయ జల విజ్ఞాన సంస్థ సైంటిస్ట్ కేవీఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ వైద్య రంగంలో విశేష కృషి చేస్తున్న ప్రముఖులను ఒకే వేదిక పైకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ ఐవీ రావును జిల్లా మాజీ గవర్నర్ విశ్వేశ్వరరావు సత్కరించారు. అనంతరం ఇదే వేదికపై వైద్యులు ఎంబీఆర్ శర్మ, గొడవర్తి రామమోహన్, వాడ్రేవు రవి తదితరులను సత్కరించారు.

పేద విద్యార్థుల భవితే లక్ష్యంగా 'యంగ్ మైండ్స్'


యంగ్‌మైండ్స్ కార్యవర్గ సభ్యులు

కరప: పేద విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారి భవితకు బాటలు వేసే లక్ష్యంతో ఉపాధ్యాయుడు వాకాడ వెంకటరమణ మరి కొందరితో కలిసి యంగ్ మైండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించారు. కాకినాడ కలెక్టర్ బంగళా వెనుకవీధిలోని అటవీ కార్యాలయం దగ్గరలో దీని నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. మండలం నడకుదురు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న వెంకట రమణ ఆ సంస్థ లక్ష్యాలను ఆదివారం విలేకరులకు వివరించారు. క్రియేటివిటీ, అపార్చునిటీ, చారిటీ, చెర్రీ అనే నాలుగురకాలుగా విద్యార్థులకు సేవలు అందిస్తామన్నారు. సంస్థ కార్యవర్గంలో సెక్రటరీగా దాడిపట్ల బాపిరాజు, ఉపాధ్యక్షుడిగా పడాల ఏడుకొండలు, గౌరవాధ్యక్షుడిగా నరాల కృష్ణకుమార్, కన్వీనర్‌గా బొజ్జా మంగారావు, కంచుమర్తి రామకృష్ణ, అగ్రపు వెంకటరమణ ఉన్నారు.

వ్యాధులు ప్రబలుతుంటే పట్టించుకోరా?

- సిబ్బందిపై జిల్లా వైద్యాధికారి ఆగ్రహం


పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి నరసింహ నాయక్

పిఠాపురం: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది రోగులకు ఎటువంటి పరీక్షలు చేయకపోవడం సరికాదని జిల్లా వైద్యాధికారి నరసింహ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఫిర్యాదుపై పిఠాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆదివారం ఆయన పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో ప్రజలు బాధపడుతూ ఆస్పత్రికి వస్తే పరీక్షలు ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే తగు వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం గ్రామాల్లో డయేరియా, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా, డ్రైన్లలో చెత్త నిల్వలు ఎప్పటికప్పుడు తొలగించేలా పంచాయతీలకు తెలపాలని అన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం

పిఠాపురం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని రూరల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుబ్బారావు అన్నారు. డయేరియా ప్రబలిన గొల్లప్రోలు 17, 18 వార్డుల్లో కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ఆదివారం ఆయన పర్యటించారు. డయేరియా సోకిన వ్యక్తుల ఇళ్లలో తాగునీటిని పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటిలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎటువంటి వ్యాధి లక్షణాలు కనిపించినా వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కుళాయిల ద్వారా కలుషిత నీరు వస్తుందని ప్రజలు వైద్య సిబ్బంది దృష్టికి తీసుకు వచ్చారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గొల్లప్రోలులో తాగునీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సామర్లకోట: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మున్సిపల్ కార్యాలయంలో గ్రీవెన్సు (ప్రజా సమస్య పరరిష్కార వేదిక) నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కమిషనర్ చాంబర్‌లో వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగ సోమవారం నుంచి ప్రారంభమయ్యే సామాజిక పింఛన్ల పంపిణీని సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసి సాయంత్రానికి వంద శాతం పూర్తి చేయాలన్నారు.

క్రీడా సమస్యలు ప్రభుత్వానికి వివరిస్తా

- కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీ
- ఘనంగా ఒలింపిక్ క్రీడాభివృద్ధి కేంద్రీయ కార్యనిర్వాహక సంఘం ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ, చిత్రంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లాలోని క్రీడా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. ఆదివారం కాకినాడలోని హెల్‌కన్ టైమ్స్ క్లబ్ కాన్ఫరెన్స్ హాల్లో ఉమ్మడి తూర్పుగోదావరి పరిధిలో ది సెంట్రల్ ఆర్గనైజింగ్ అసోసియేషన్ ఫర్ ఒలింపిక్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ప్రారంభ కార్యక్రమంలో పంతం నానాజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాల స్థాయిలో వ్యాయామ విద్య నిత్యం నిర్వహించాలని నానాజీ పేర్కొన్నారు. ది సెంట్రల్ ఆర్గనైజింగ్ అసోసియేషన్ ఫర్ ఒలింపిక్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ ముత్తా నవీన్ మాట్లాడుతూ జిల్లాలో ఏ అసోసియేషన్‌కూ సంబంధం లేకుండా స్వయం ప్రతిపత్తితో పేద క్రీడాకారులకు తగిన ప్రోత్సాహాన్ని అందించడం ఈ సంఘం ముఖ్య ఉద్దేశం అన్నారు. గౌరవ అతిథి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ టీ20 ప్రపంచ కప్ గెలిచిన జట్టుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అమలాపురం నుంచి ప్యారిస్‌లో జరిగే ఒలింపిక్స్‌కు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ బ్యాడ్మింటన్‌లో ఆడడం ఆనందంగా ఉందన్నారు. సాత్విక్‌ను అంతర్జాతీయ క్రీడాకారుడిగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల కృషి ఎంతో ఉందన్నారు. కమిటీ కో-ఆర్డినేటర్ కె.పద్మనాభం మాట్లాడుతూ గత ఏడాది కమిటీ తరపున సామర్లకోటకు చెందిన దివంగత వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారుడు సూర్యారావుకు రూ.20 వేలు, జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారిణి ధాత్రికి రూ.35 వేలు, వెయిట్‌లిఫ్టర్ వెంకటరావుకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించామన్నారు. అనంతరం అతిథులను కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు ఎంఏ దీన్, కబడ్డీ విశ్రాంత కోచ్ సాయి ప్రసాద్, పీఈటీ సంఘ మాజీ అధ్యక్షుడు పప్పుల శ్రీరామ చంద్రమూర్తి, రాయుడు శ్రీనివాస్, లక్ష్మణ్, కె.యమున పాల్గొన్నారు.

క్రీడాభారతి అధ్యక్షుడిగా దీన్

కాకినాడ జిల్లా క్రీడాభారతి అధ్యక్షుడిగా రిటైర్డ్ డీఎస్‌డీఓ ఎంఏ దీన్ నియమితులయ్యారు. ఆదివారం కాకినాడలో క్రీడాభారతి నూతన కార్యవర్గాన్ని క్రీడాభారతి జాతీయ ప్రతినిధి ధనుంజయ్ రెడ్డి ప్రకటించారు. ఉపాధ్యక్షురాలిగా కె.యమున, చైర్మన్‌గా డాక్టర్ సుగుణ, కార్యదర్శిగా మూర్తి, కోశాధికారిగా నాగేంద్రకుమార్, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మణ్, ఈసీ మెంబర్లుగా రాయుడు శ్రీనివాస్, కృష్ణ తదితరుల పేర్లను ధనుంజయ్ రెడ్డి చదివి వినిపించారు.

గర్జిస్తున్న గ్రామ సింహాలు


కొత్తపల్లిలో సంచరిస్తున్న కుక్కలు

కొత్తపల్లి: మండలంలో ఏ ఊరు, ఏ వీధి చూసినా గ్రామ సింహాలు గర్జిస్తున్నాయి.. ఆ దారిన పోయే వారిని హడలెత్తిస్తున్నాయి. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. మండలంలోని ఉప్పాడ, కొత్తపల్లి, అమీనాబాద్, మూలపేట, కొండెవరం, కొమరగిరి, నాగులాపల్లి తదితర గ్రామాల్లో సైతం కుక్కల దాడిలో గాయపడే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. పాదచారులతోపాటు ద్విచక్ర వాహనాల వెంటపడి దాడి చేస్తుండడంతో ప్రజలు ఆస్పత్రి పాలవుతున్నారు. ప్రధాన కూడళ్లు, మాంసం దుకాణాలు, చేపల మార్కెట్లలో తిష్ట వేస్తున్నాయి. వాహనాలపై వెళ్లేవారిని తరిమి తరిమి కరుస్తున్నాయి. కుక్కల దాడి నుంచి రక్షించుకునే ప్రయత్నంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొత్తపల్లి, కొమరగిరి, నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నెల రోజుల నుంచి సుమారు 300 కేసులు వచ్చినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ముఖ్యంగా కుక్క కాటుతో ఎక్కువగా చిన్నారులు, వృద్ధులు వైద్యానికి వస్తున్నారు. అధికారులు స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.